గంపెడాశలు.. అడియాశలు

మామిడి దిగుబడిపై గంపెడాశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగిలేలా ఉంది. అనుకూలించని వాతావరణ పరిస్థితులకు తోడు, తెగుళ్ల కారణంగా మామిడికి పిందెలు కూడా రావడం లేదు. ఈ పరిస్థితిలో అసలు సరైన దిగుబడే లేకుంటే ఎలా గట్టెక్కాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- కనిపించని మామిడి పిందెలు
- అరకొర పిందెలూ రాలిపోతున్నాయి
- పంటకు శాపంగా మారిన వాతావరణం

కావలి : నియోజకవర్గంలో 3,500 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. కానీ పిందెలు రాలిపోతున్నందున రైతులు నిరాశకు గురవుతున్నారు. మామిడి తోటల్లో ఏ చెట్టును చూసినా పూత మాడిపోయినట్లు ఉండి పిందెలు అరకొరగా కనిపిస్తున్నాయి. డిసెంబర్‌లో మొదలైన చలి, సంక్రాంతికి చుట్టుముట్టిన పొగ మంచు మామిడి తోటలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఇప్పటికే పూత ఆలస్యం కావడంతో పాటు, వచ్చిన పిందెలు కూడా రాలిపోతున్నాయి. ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గుల వల్ల పలు రకాల తెగుళ్లు సోకుతున్నాయి. ఈ పరిస్థితులు


మామిడి తోటలు


మామిడి చెట్టుకు మాడిపోతున్న పూత

మామిడి రైతుకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఈ సమయంలో పూత పిందెను కాపాడుకోకుంటే.. తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయి.

ఉష్ణోగ్రతల ప్రభావం

సాధారణంగా డిసెంబర్ చివరి వారంలోనే మామిడిలో పూత రావాల్సి ఉంది. కానీ ఇప్పటికీ సగానికిపైగా చెట్లు మొగ్గ కూడా కట్టకపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపొచ్చనే ఆందోళన ఉంది. చలితీవ్రతలో హెచ్చుతగ్గులు, వాతావరణ మార్పులు, పొగమంచు వల్లే పూత రావడం ఆలస్యమవుతుందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

తెగుళ్లతోనూ తీవ్ర నష్టం

జనవరి, ఫిబ్రవరిలో చలి తీవ్రత వల్ల తోటల్లో తెగుళ్లు, చీడపీడల తీవ్రత పెరిగింది. తేనెమంచు, బూడిద తెగులు, రసంపీల్చే పురుగులు కనిపిస్తున్నాయి. ఇవి పూత, పిందె, కాయ దశల్లో చెట్లను ఆశించి, ఎక్కువగా నష్టపరుస్తాయి. ప్రస్తుతం


పూత మాడిపోయినట్లుగా ఉన్న పిందెలు

మామిడి పంటలో తేనెమంచు పురుగు, తామర పురుగులు, బూడిద తెగులు ఎక్కువగా ఉంది. ప్రస్తుత పూత, పిందెలు వచ్చే కీలకదశలో సరైన జాగ్రత్తలు తీసుకుంటున్నా.. వాతావరణ మార్పుల వల్ల మామిడికి పలు రకాల తెగుళ్లు సోకుతున్నాయి. దీనివల్ల మామిడి తోటలో పూత వచ్చినా పిందె రాలిపోతోంది. మామిడిలో అసలే అరకొర పూతతో రైతులు అల్లాడుతుంటే, మొదటికే మోసం వచ్చేలా పిందెలు నిలబడడం లేదు.

తగ్గే అవకాశం

పరిస్థితులు అనుకూలిస్తే ఎకరానికి 3.5 టన్నుల చొప్పున రావాల్సిన దిగుబడి.. ప్రస్తుతం ఒకటి నుంచి 1.5 టన్నుకు తగ్గిపోయే అవకాశముందని అంచనా వేస్తున్నారు. మామిడి దిగుబడిపై ఈ ఏడాది అధిక వర్షాలు కూడా ప్రభావం చూపాయి. సాధారణంగా జూన్, జూలై లోనే వర్షాలు ప్రారంభమై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు కురుస్తాయి. కానీ గతేడాది నవంబర్ చివరి వరకూ అధిక వర్షాలు కురిశాయి. దీంతో నేలలో తేమశాతం పెరిగింది. తేమ ఆరక, చెట్టుకు పూత రాకుండా కొమ్మలు చిగురించాయి. అయితే తెగుళ్లు, వాతావరణ పరిస్థితుల కారణంగా పంట దిగుబడి భారీగా తగ్గిపోయే అవకాశం ఉంది.

సస్యరక్షణ చేపట్టాలి



తెల్లపూత దశలో ఎటువంటి మందులు పిచికారీ చేయకూడదు. పూత పిందె దశలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అధికంగా పిందె రాలకుండా ఉండాలంటే నీటి యాజమాన్యం చేపట్టాలి. అంతేకాకుండా ప్లేనోఫిక్ కెమికల్ 4 గ్రాముల చొప్పున 20 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. దీనివల్ల పిందె రాలకుండా ఉంటుంది. దీంతో పాటు కలుపు నివారణ సమగ్రంగా చేపట్టాలి.

– ఎం.సుధామయి, ఉద్యానాధికారి, కావలి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న సీఐ గంగాధర్

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు సీఐ జి.గంగాధర్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం రోడ్డు ప్రమాదాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతలక్ష్మి, ఉపాధ్యాయుడు మధుసూదన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై సదస్సు



సంగం : సైబర్ నేరాలు, సామాజిక అంశాలపై మండలంలోని జెండాదిబ్బ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్సై రాజేష్ విద్యార్థులకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్– బ్యాడ్ టచ్, సెల్‌ఫోన్ వినియోగం తదితరాలపై సూచనలు చేశారు. అదేవిధంగా నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హెచ్‌ఎం మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల్లో మొక్కల తొలగింపు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో, మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించి జామాయిల్, సరుగుడు మొక్కలు నాటుతున్నారని ఇటీవల అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆర్డీఓ ఆదేశాలతో తలారులు, వీఆర్వోలు, డీటీలు, రెవెన్యూ సిబ్బంది నెల్లూరుపాళెం సమీపంలో ఆక్రమిత భూముల్లోని జామాయిల్ మొక్కలను తొలగించారు. అదేలా మున్సిపల్ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఆక్రమిత భూముల్లో ఉన్న మొక్కలను మంగళవారం తొలగించారు.

వైభవంగా గ్రామోత్సవం



జలదంకి : మండల కేంద్రమైన జలదంకిలో రజకుల కులదైవం మడియాలస్వామి తిరునాళ్ల వేడుకలను మంగళవారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలనంతరం గ్రామోత్సవం వేడుకగా సాగింది. కార్యక్రమంలో రజకుల సంఘ సభ్యులు ఒంగోలు మదన్, కామేపల్లి మణికంఠ, మధు, మహేష్, నరేష్, రవీంద్ర, మాదవరావు, మనోహర్ పాల్గొన్నారు.

వైద్యాధికారి సమావేశం



వరికుంటపాడు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారి కరీష్మా ఆశా కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 10న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని బాధ్యతగా చేపట్టాలని సూచించారు. సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సువార్తమ్మ, సూపర్‌వైజర్ వెంకటయ్య పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు సైన్స్ ప్రాజెక్ట్



కావలి : 'ఇన్‌స్పైర్ మనక్'లో భాగంగా పట్టణంలోని నలంద ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థినులు బీవీఎస్ మోక్ష, జె.భారతి తయారు చేసిన 'ఆటోమెటిక్ స్ట్రీట్ లైట్ సిస్టమ్ ప్రాజెక్ట్' జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా చేసిన ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికవడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.

ఫిజికల్ కాపీలు అందించాలి

సీతారామపురం : ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ఇతర కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఈనెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు వాటి ఫిజికల్ కాపీలను ఎంపీడీఓ కార్యాలయంలో అందించాలని ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం తెలిపారు. రుణాల కోసం దరఖాస్తులను గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రాలు, ఇతర కంప్యూటర్ సెంటర్లలో ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు.

ఇన్‌చార్జి సర్వేయర్‌గా శ్రీకాంత్

మర్రిపాడు : మండల ఇన్‌చార్జి సర్వేయర్‌గా శ్రీకాంత్‌ను నియమించినట్లు మండల ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ మంగళవారం తెలిపారు. ఉదయగిరి మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న ఆయన మర్రిపాడుకు ఇన్‌చార్జిగా నియమించామన్నారు.

ఆశా వర్కర్‌కు సన్మానం

మర్రిపాడు : గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఆశా వర్కర్ ఇరుపోతు రమాదేవిని మర్రిపాడు పీహెచ్‌సీలో వైద్యాధికారి గోపినాథ్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు : మండలంలోని కోళ్లకు కొక్కెర వ్యాధి సోకకుండా పెంపకందారులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి సంగుబొట్ల రాఘవేంద్రవర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో కోళ్లు కొక్కెర వ్యాధితో చనిపోతున్నాయన్నారు. ముందస్తుగా పశువైద్య సిబ్బందిని సంప్రదించి టీకాలు వేయించాలన్నారు.

ఎంఈఓకు అవార్డు

సోమశిల : అనంతసాగరం ఎంఈఓ–2గా విధుల్లో ఉన్న కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. నెల్లూరు టౌన్‌హాల్లో రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్, జిల్లా అసోసియేషన్ వారు నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘ అధ్యక్షుడు తులసి ప్రసాద్ చేతుల మీదుగా సన్మానం చేసి అవార్డును అందజేశారు.

భూసేకరణలో టీడీపీ నేతల తీరును సహించం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ
- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్మించిన రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటయ్యే పరిశ్రమల కోసం ప్రస్తుత ప్రభుత్వం అవసరమైన భూములను సేకరించడానికి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని, దీనిని సహించమని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలోని ఆయన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చెన్నాయపాళెం, ఆనెమడుగు, సారవ్యపాళెం, పెద్దపట్టపుపాళెం గ్రామాల్లో భూములు ఎకరాకు కనీసం రూ.30 లక్షలు నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని అప్పట్లోనే నిర్ణయించామని, కానీ ఇప్పుడు టీడీపీ నాయకులు గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు కూడా కనీస సమాచారం ఇవ్వకుండానే భూసేకరణ కోసం గ్రామసభలు పెట్టిస్తున్నారన్నారు. కేవలం రూ.11 లక్షలు ఇస్తామని, ప్రభుత్వ భూమి అయితే అసలు ఏమీ ఇవ్వమని దబాయిస్తున్నారని తెలిపారు. ఎన్నికల వేళ ప్రజలు, రైతులను మభ్యపెట్టి రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు ఇప్పిస్తామని చెప్పి ఇప్పుడు విస్మరించడం తగదన్నారు. టీడీపీ నాయకులు, అధికారులు కలిసి తక్కువ ధరలకే భూములు తీసుకోవాలని కుయుక్తులు పన్నుతున్నారని చెప్పారు. ఈ విషయంలో వైఎస్సార్‌సీపీ మాత్రం రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. రైతులకు ఎకరాకు రూ.30 లక్షలకు తగ్గకుండా నష్ట పరిహారం వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. సంగం బ్యారేజీ వద్ద కావలి కాలువకు బైపాస్ కెనాల్ నిర్మించడం, కావలి పెద్ద చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడం, కావలి ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయడం తదితర వాటిపై సత్వరమే దృష్టి పెట్టాలన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పొగాకు క్యూరింగ్ పరిశీలన


ముస్తాపురంలో క్యూరింగ్ పూర్తయిన పొగాకు పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరురూరల్ : మండల పరిధిలో సాగులో ఉన్న పొగాకు పంటకు సంబంధించి క్యూరింగ్ ప్రక్రియను పొగాకు బోర్డు అధికారులతో కలిసి కొనుగోలు కంపెనీల ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని జాలయ్యనగరం, రావులకొల్లు, నెల్లూరుపాళెం, ముస్తాపురం తదితర గ్రామాల్లో క్యూరింగ్‌లో ఉన్న బ్యారెన్ల వద్దకు అధికారులు వెళ్లి రైతులకు పలు సూచనలు చేశారు. డీసీపల్లి వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.రాజశేఖర్, క్షేత్రాధికారి ఆదర్శ్, కందుకూరు వేలం కేంద్రం ఎస్‌జీఓ శివకుమార్, ఐటీసీ, జీపీఐ కంపెనీల ప్రతినిధులు వెంకట్రావు, శ్రీనివాసరావు తదితరులు హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు సాగు అధికమైందన్నారు. ఈ క్రమంలో రైతులు నాణ్యత గల పొగాకు దిగుబడులను సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల సూచనలకు తగినట్లు ఎరువులు, పురుగు మందులు వాడాలన్నారు.

అధిక దిగుబడులు సాధ్యం

కలిగిరి : పొగాకు బోర్డు అధికారుల సూచనల మేరకు యాజమాన్య పద్ధతుల్లో పొగాకు సాగు చేస్తే రైతులు లాభాలు పొందవచ్చని వేలం నిర్వహణాధికారి వి.మహేష్‌కుమార్ తెలిపారు. కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని కృష్ణారెడ్డిపాళెం, శెట్టిపాళెం గ్రామాల్లో రైతు మిత్ర బృందం సభ్యులు మంగళవారం పర్యటించారు. సాగులో ఉన్న పొగాకు తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ కార్యాలయ ఎస్‌జీఓ శివకుమార్, ఐటీసీ మేనేజర్ వెంకటరావు, జీపీఐ మేనేజర్ ఉన్నం శ్రీనివాసరావు, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ఉండాలి

చేజర్ల : విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన ఉండాలని భారతీయ మహాసేన అధ్యక్షుడు జువ్విగుంట బాబు అన్నారు. మండలంలోని ఓబులాయపల్లి ప్రాథమిక పాఠశాల, పీకేపాడులోని ఉన్నత పాఠశాలల్లో రాజ్యాంగంపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాజ్యాంగాన్ని పాఠశాల విద్యలో చేర్చాలని కోరారు. అనంతరం విద్యార్థులకు బాలల రాజ్యాంగాన్ని అందజేశారు. పీకేపాడు పాఠశాలలో పదో తరగతి చిన్నారులకు విద్యాసామగ్రిని అందించారు. హెచ్‌ఎంలు మోహన్, కృష్ణయ్య, విద్యా కమిటీ చైర్మన్ బాబురాజేశ్వరరావు పాల్గొన్నారు.

విలీన ప్రక్రియను రద్దు చేయాలని నిరసన


నిరసన తెలుపుతున్న అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీవాసులు

సీతారామపురం : పాఠశాలల విలీన ప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన తెలిపారు. యాభై ఏళ్లుగా తమ కాలనీలో కొనసాగుతున్న పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను ప్రస్తుతం సుమారు 3 కి.మీ. దూరంలో ఉన్న పోలంగారిపల్లిలోని పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. రెండు గ్రామాల నడుమ జాతీయ రహదారి ఉన్నందున విద్యార్థులు రోడ్డు దాటి వెళ్లాలంటే తగిన భద్రత ఉండదన్నారు. సుదూర ప్రాంతంలోని పాఠశాలకు వెళ్లలేక విద్యార్థులు విద్యకు దూరమై డ్రాపౌట్స్‌గా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు విలీన ప్రక్రియపై పునరాలోచించి గ్రామంలోని పాఠశాలలోనే 3, 4, 5 తరగతులు ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ మస్తాన్‌వలికి అందించారు. అందుకు స్పందించిన ఆయన ఇది ప్రభుత్వ నిర్ణయమని, రద్దు ప్రక్రియ తమ చేతుల్లో లేదన్నారు.

ఆలయాల్లో రథసప్తమి పూజలు


గండిపాళెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో..

ఉదయగిరి : రథసప్తమి పర్వదినం సందర్భంగా మండలంలోని పలు దేవాలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం, కుర్రపల్లి, లింగాలదొన, అయ్యవారిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో రథసప్తమి శోభ నెలకొంది.

గీతా ఆశ్రమంలో..



అల్లూరు : స్థానిక గీతా ఆశ్రమంలో రథసప్తమి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగింది. భక్తులు విశేషంగా తరలివచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌వలీ

సీతారామపురం : పాఠశాలల్లో గుణాత్మక విద్యను పెంపొందించేలా ఉపాధ్యాయులు దోహదపడాలని ఎంఈఓ మస్తాన్‌వలీ కోరారు. ఆయన బసినేనిపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్లస్టర్‌స్థాయి సమావేశంలో మంగళవారం పాల్గొని, మాట్లాడారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల అభివృద్ధిపై సమీక్షించి ఎస్‌ఎంసీ సభ్యుల ఆమోదం మేరకు ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా ఏర్పాటు చేసేందుకు తల్లిదండ్రుల కమిటీ సలహాలు తీసుకోవాలన్నారు.

మార్చి నాటికి ఉదయగిరి ఆనకట్ట పూర్తి


ఉదయగిరి ఆనకట్ట మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ దేశ్‌నాయక్

ఉదయగిరి : ఉదయగిరి ఆనకట్ట పనులను మార్చి చివరి నాటికి పూర్తి చేస్తామని ఇరిగేషన్ శాఖ జిల్లా ఎస్‌ఈ దేశ్‌నాయక్ తెలిపారు. ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి ఉదయగిరిలోని ఆనకట్ట పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గ్రామకొలను పథకం కింద గత ప్రభుత్వం జిల్లాలో 38 చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులకు రూ.70 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా చెరువుల కట్టలు ఆధునికీకరించి వాకింగ్ ట్రాక్, విద్యుద్దీపాలు, ప్రజలు సేదతీరేందుకు కుర్చీలు, బల్లలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆహ్లాదకర వాతావరణం కల్పించే నిమిత్తం పచ్చిక బయళ్లతో టైల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అయితే ఈ పనులు గతేడాది మార్చి నాటికి పూర్తి కావల్సి ఉన్నప్పటికీ కొన్ని కారణాలరీత్యా ఆలస్యమైందన్నారు. ఉదయగిరి ఆనకట్ట అభివృద్ధికి రూ.9 కోట్ల నిధులు మంజూరు కాగా ఇప్పటికే రూ.7 కోట్ల మేర పనులు పూర్తి చేశామన్నారు. అనంతరం గండిపాళెం ప్రాజెక్టు, లింగాలదొన చెరువులను పరిశీలించారు. ఆయనతో పాటు ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రమౌళి, ఏఈలు వేణు, సురేష్, తదితరులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు కీలకం


ఉదయగిరి : శకునాలపల్లిలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు


సీతారామపురం : వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి : పంట సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ఎంతో కీలకమని మండల ఏఓ ఆంజనేయులునాయక్ తెలిపారు. మండలంలోని శకునాలపల్లి, కృష్ణంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర పరిశీలన చేసి పలు పైర్లకు తెగుళ్లను గుర్తించారు. వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. వీఏఏ చల్లా పూజిత పాల్గొన్నారు.

పర్యవేక్షణ ముఖ్యం

అల్లూరు : పంటలపై రైతులు తగిన పర్యవేక్షణ చేయాలని మండల ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని ఇస్కపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చిరొట్ట ఎరువుల వల్ల కలిగే లాభాల గురించి రైతులకు వివరించారు.

పొంగూరు, భీమవరంలలో..

మర్రిపాడు : మండలంలోని పొంగూరు, భీమవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఏఓ రామ్మోహన్ క్షేత్ర సందర్శన చేపట్టి వరి పంటలో అగ్గి తెగులు, కాండం కుళ్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం రైతులకు వాటి నివారణ చర్యలు సూచించారు. వీఏఏలు పెంచలయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.


సస్యరక్షణ చేపట్టాలి

సీతారామపురం : వరిపంటలో కాండం తొలుచు పురుగును గుర్తించినందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. ఆయన మండలంలోని నారాయణప్పపేట, సింగారెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మంగళవారం పాల్గొని, మాట్లాడారు. చిరుపొట్ట దశలో ఎకరానికి 30 కిలోల చొప్పున యూరియా, పొటాష్ వాడాలన్నారు. జింకు లోపం నివారణకు లీటరు నీటికి రెండు గ్రాముల జింకు సల్ఫేట్‌ను పిచికారీ చేయాలన్నారు. ఏఈఓ సాంబశివయ్య, వీఏఏలు హాజిరాబేగం, నరేంద్ర, స్వప్న పాల్గొన్నారు.


తాటాకుల పంచ దగ్ధం


ఉదయగిరి : మండలంలోని గుడినరవకు చెందిన తిరుమాలపురం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు అంబటి భాస్కర్‌రెడ్డి ఇంటి ముందు ఉన్న తాటాకుల పంచ దగ్ధమైన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ప్రస్తుతం భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో తెలంగాణలో ఉంటున్నారు. ఆయన తల్లి మాత్రమే ఒంటరిగా ఇక్కడ ఉంటోంది. అయితే ఘటన జరిగిన రోజు ఆమె కూడా ఇంట్లో లేదు. దీనిపై ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డిని వివరణ కోరగా, ఇంత వరకు ఫిర్యాదు అందలేదన్నారు.

కేన్సర్ కారకాలకు దూరంగా ఉండాలి



కావలి : మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత


వింజమూరులో కేన్సర్ రోగిని పరిశీలిస్తున్న మాశిలామణి


ఉదయగిరిలో..

కావలి : కేన్సర్ కారకాలైన మాదక ద్రవ్యాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజిత అన్నారు. పట్టణంలోని ఏరియా హాస్పిటల్ ప్రాంగణంలో కావలి డివిజన్ పరిధిలోని ఏఎన్‌ఎంలు, ఆశా ఉద్యోగులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం, పొగ తాగడంతో పాటు ఆహార పదార్థాల్లో రంగులు, రసాయనాల వినియోగం కూడా కేన్సర్ కారకాలు అని వివరించారు. అనంతరం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి, ఎస్సై ఖలీమ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు మానవతా కోణంలో సాయపడాలని కోరారు.

- ఉదయగిరి : మండలంలోని అప్పసముద్రం హెల్త్ క్లినిక్‌లో మండల వైద్యాధికారిణి వినీత మంగళవారం ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. ఇందుకోసం తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి కేన్సర్ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఉదయగిరి సీహెచ్‌సీలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈనెల 10న జరిగే డీవార్మింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు.
- కేన్సర్‌తో బాధపడుతున్న వారికి వింజమూరులో విశ్రాంత డీఎంహెచ్‌ఓ మాశిలామణి అవగాహన కల్పించారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులతో కేన్సర్ వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ నిర్ణీత వ్యవధిలో ముందస్తు పరీక్షలు చేయించుకోవాలన్నారు. మొదటి దశలో చికిత్స చేయించుకుంటే వ్యాధిని త్వరగా నయం చేసుకోవచ్చని తెలిపారు.